క్లుప్తంగా

స్పందనలో ఒక అర్జీ



అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : స్పందనలో ఒక అర్జీ వచ్చినట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సుంకపూరు గ్రామానికి చెందిన అల్లు సత్యవతి వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం గురించి ఒక అర్జీ ఇచ్చినట్టు తెలిపారు. గ్రామంలోని లే అవుట్‌లో తనకు కేటాయించిన ఇంటి స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నామని, అయితే ఎక్కువ స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నట్టు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై వివరణ ఇస్తూ అర్జీ పెట్టినట్టు తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

పాయకరావుపేట : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామ కార్యదర్శులు సత్వరమే పూర్తి చేయించాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఆయన సోమవారం మంగవరం, అరట్లకోట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి పన్నులు వసూళ్ళు చేపట్టాలని, చెత్త నుంచి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలని అన్నారు.

జువ్వాలమ్మతల్లి పండగ నేడు

మునగపాక : మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో మంగళవారం జువ్వాలమ్మ తల్లి పండుగ ఘనంగా నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కోన వెంకటలక్ష్మి తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. అదేరోజు రాత్రి గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలు, నేల వేషాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జువ్వాలమ్మను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.

ఘనంగా రాములోరి తీర్థం

రాంబిల్లి : వెల్పూరు శివారు సంతపాలెంలో సోమవారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిరిదెళ్ల దేముళ్లు, గ్రామ నాయకులు చిన్న, ఆనంద్ , నాగరాజు తదితరులు సీతారాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు. భజనలు, కోలాటాలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి : గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి దగ్గర నుంచి నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని పేర్కొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆవ సోమవరం పంచాయతీ సానికాలువ నుంచి ఎరుకురెడ్డిపాలెం వాటర్ ట్యాంక్ ఆర్అండ్‌బీ రోడ్డు వరకూ నిర్మించనున్న బీటీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరి కాయలు కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ దంపతులు కోలా అప్పలరాజు, నాగమణి, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, లచ్చన్నాయుడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, కొరుప్రోలు అప్పారావు, వరహాలు, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

- ప్రభుత్వ పథకాలపై మరింత అవగాహన కల్పించాలి
- వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ తదితరులు

మునగపాక : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలన్నీ కలిసి వచ్చినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ కూడా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు గృహ సారథుల నియామకం జరిగిందన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయం చేసుకుంటూ సీఎం జగన్ అందిస్తున్న పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీకి, ప్రభుత్వానికి పేరు వచ్చేలా పాటుపడాలన్నారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు శత శాతం అమలు జరిగాయన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాటుపడాలన్నారు. ప్రభుత్వ పథకాలపై మరింత అవగాహన కల్పించి వచ్చే ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు పాలిమేర గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామిసత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, మళ్ల ఉమామహేశ్వరరావు, హరేరామ, పార్టీ అధికార ప్రతినిధులు ఆడారి కాశీబాబు, పిట్టా మంగారెడ్డితో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన శూలాల సంబరం



నక్కపల్లిలో కోలాటమాడుతున్న మహిళలు



సంబరాల్లో నేల వేషాలు



శూలాలు గుచ్చుకుని నృత్యాలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి : మండల కేంద్రంలో భావనారుషి పండగ(శూలాల సంబరం) సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా మాఘమాసంలో పద్మశాలీ సోదరులు భావనారుషి పండగను శూలాల సంబరం పేరుతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భావనారుషి ఆలయం వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. నేల వేషాలు, శక్తి వేషాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తిరునాళ్లు నిర్వహించారు. భక్తులు నాలుకలపై శూలాలు గుచ్చుకుని ప్రభలు చేతపట్టి నృత్యాలు చేస్తూ నక్కపల్లి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉపవాసం ఉన్న భక్తులు పత్రి తీసుకురాగా పూజారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. భావనారుషి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. శూలాల సంబరాన్ని తిలకించేందుకు నక్కపల్లి పరిసర ప్రాంతాలనుంచి వేలాది మంది తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు,కోలాటాలు, ఆర్కెస్ట్రాలు ఆకట్టుకున్నాయి.

జగనన్న రుణం తీర్చుకుంటా..

- నా కుమారుడి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.12 లక్షలు ఇచ్చారు
- నియోజకవర్గంలో పార్టీ విజయమే నా ప్రధాన కర్తవ్యం
- సామాన్య కార్యకర్తగా పనిచేస్తా: మాజీ ఎమ్మెల్యే చెంగల



విలేకర్లతో మాట్లాడుతున్న చెంగల వెంకటరావు

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం కోసం, జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేయడం కోసం ఒక సామాన్య కార్యకర్తగా పనిచేస్తానని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు అన్నారు. సోమవారం ఆయన పాయకరావుపేట ప్రభుత్వ అతిథి గృహంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తన కుమారుడు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రి పాలై, తాను కష్టకాలంలో ఉన్నప్పుడు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.12 లక్షలు మంజూరు చేశారన్నారు. ఆయన రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. మూడుసార్లు పాయకరావుపేట ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో ప్రతి గ్రామంలో తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నానన్నారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించడమే తన లక్ష్యమన్నారు.

సోమిదేవపల్లిలో పూరిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన పూరిల్లు

ఎస్.రాయవరం : పెనుగొల్లు శివారు సోమిదేవపల్లి గ్రామంలో సోమవారం పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితురాలు బంగారి రమణమ్మ తెలిపారు. గ్రామంలో ఇంటివద్ద ఎవరూ లేనప్పుడు మంటలు చెలరేగి ప్రమాదం చోటు చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. పూరింట్లో మంటలు చూసి స్థానికులు హుటా హుటీన మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఇంట్లో ఉన్న వంట వస్తువులు, బీరువాల్లో దుస్తులు, సామాగ్రి పూర్తి కాలిపోయాయి. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నష్టపరిహారం అంచనా వేసి, తక్షణ సహాయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యసేవలు



తిమ్మరాజుపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ కోరారు. తిమ్మరాజుపేట సచివాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. వైద్యాధికారులు ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. చూచుకొండ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

కోటంరెడ్డి, ఆనం అవకాశవాదులు

- కార్యకర్తలే పార్టీకి కొండంత అండ
- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం



నక్కపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి, జగన్‌మోహన్‌రెడ్డికి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలే అండ అని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. అవకాశవాద ఎమ్మెల్యేల వల్ల పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలను ఉద్దేశించి అన్నారు. వారు పార్టీని వీడడం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. కేవలం మంత్రి పదవులు ఇవ్వ లేదన్న అక్కసుతో పార్టీపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. ఇలాంటి అవకాశవాద ఎమ్మెల్యేల పట్ల పార్టీ తీసుకున్న నిర్ణయం సరైనదేనన్నారు. పదవులను ఆశించి వచ్చే నాయకులు ఎవరూ పార్టీకి విధేయులుగా ఉండరన్నారు. ఏ పదవి ఆశించకుండా పదేళ్ల నుంచి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలే పార్టీకి నిజమైన వారసులన్నారు. సైనికుల్లా కష్టపడి పనిచేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2010 నుంచి వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు ఎక్కడా చెక్కు చెదరలేదన్నారు.

ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే ధైర్యం ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కార్యకర్తలు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా సంక్షేమ పథకాలు పార్టీల కతీతంగా అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్ర పేటెంట్ వైఎస్సార్ కుటుంబానిదేనన్నారు. లోకేష్ పాదయాత్ర వల్ల ఒరిగేదేమీలేదన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఏమి అవసరమో అదే చేస్తోందన్నారు. ప్రజలు మళ్లీ ఆయనకే అధికారం కట్టబెడతారన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పలు వీధుల్లో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. డ్రైనేజీలలో పూడికలు తీసి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వీధుల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ నిర్దేశించిన స్థలాల్లో మాత్రమే వేయాలని కోరారు. గ్రామంలో ఆహ్లాద వాతావరణానికి అందరూ తోడ్పాటునందివ్వాలన్నారు.

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కండి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటింటికి ధర్మ ప్రచారం చేస్తూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములవుతున్న సమరసతా సేవా ఫౌండేషన్‌కు మద్దతు ఇవ్వాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ కోరారు. సోమవారం అచ్యుతాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాలు నిర్మించడం, పేదలను దివ్య దర్శనానికి తీసుకెళ్లడం , ధర్మ పరిరక్షణకు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తుల మనోభావాలకు సమరసతా సేవా ఫౌండేషన్ దగ్గరయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, బంటు రాము, ద్వారపురెడ్డి బాబ్జి, కొమ్మోజు ఈశ్వరరావు పాల్గొన్నారు.

99వ రోజుకు నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి : నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు సాగిస్తున్న ధర్నా 99 రోజులకు చేరింది. మంగళవారం నాటికి ధర్నాకు 100 రోజులు పూర్తి కానున్నాయి. ఈ ధర్నాలో వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెంతో పాటు మరో 5 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి మధ్య వివాదం

మునగపాక: ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి మధ్య తలెత్తిన వివాదం డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ జోక్యంతో సద్దుమణిగింది. పంచాయతీ కార్యదర్శి షహీమా పార్టీ ఫ్లెక్సీని తొలగించడంతో ఎంపీటీసీ కర్రి సంజీవినికి, ఆమెకు మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో పల్లపు ఆనందపురం సచివాలయానికి ఎంపీటీసీ సోమవారం తాళం వేసి, నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ స్పందించి సచివాలయం తలుపులు తెరిపించేలా చర్యలు తీసుకోవడంతో వివాదం సమసిపోయింది.

భూ సర్వేపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కోటవురట్ల: అరవై ఏళ్లుగా సాగులో ఉన్నాం. పాసు పుస్తకాలు ఉన్నాయి. ఇపుడేమో ప్రభుత్వ భూమి అంటున్నారు. ఇది ఎంత వరకు సమంజసమంటూ లింగాపురం గ్రామస్తులు మండిపడుతున్నారు. లింగాపురం రెవెన్యూ పరిధిలో కొద్ది రోజులుగా సమగ్ర భూ రీ సర్వే నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రైతుల సాగులో ఉన్న సుమారు 150 ఎకరాల భూమిని గెడ్డ పోరంబోకు, ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు బాంబు పేల్చారు. దాంతో హతాశులైన రైతులు ఆందోళన బాట పట్టారు. తహసీల్దారు కార్యాలయానికి సుమారు 50 మంది రైతులు చేరుకుని ఆందోళన చేశారు. తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి సమస్యను వివరించి న్యాయం చేయాలని, పూర్తి సమాచారం వచ్చేంత వరకు రీ సర్వే పనులను నిలిపివేయాలని కోరారు.

అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు

పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మించడం జరుగుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలో ఉపమాక నుంచి కొర్రవానిపాలెం గ్రామానికి వెళ్లేందుకు రూ.84 లక్షలతో నిర్మించే తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు రూ.63 కోట్ల వ్యయంతో ప్రత్యేక మరమ్మతుల కింద రిపేర్లు కొత్తరోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టడం జరిగిందన్నారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా కొర్రవానిపాలెం గ్రామ ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలకు పక్కా రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. శాశ్వత పనులు తమ ప్రభుత్వ హయాంలోనే జరుగుతున్నాయన్నారు. గ్రామాలకు కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను తక్షణమే చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రధానంగా గ్రామాలకు రోడ్లు, డ్రైయినేజీలు తాగునీరు, సమకూరుస్తున్నామన్నారు. ఉపమాక పరిసర ప్రాంతాల్లో ఉన్న శివారు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.2.89 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీలు కొల్నాటి బుజ్జి, దేముళ్లు, మాజీ ఎంపిటీసీ కొప్పిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, గొర్ల బాబూరావు పాల్గొన్నారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహించే వారికి తగిన గుర్తింపు



గణేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు, పార్టీ నేతలు జగన్నాథం, ప్రసాద్, సుకుమారవర్మ



వలంటీర్ రూపను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన నాడే మంచి ఫలితాలు సాధించగలమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పేర్కొన్నారు. మునగపాక మండల సచివాలయాల కన్వీనర్ల సంఘ అధ్యక్షునిగా నియమితులైన పాలిమేర గణేష్‌ను ఆయన సోమవారం మునగపాకలో సత్కరించారు. గణపర్తి గ్రామానికి చెందిన వలంటీర్ రూప తన విధి నిర్వహణలో భాగంగా ఏలూరులో చికిత్సపొందుతున్న లబ్ధిదారునికి పింఛన్ అందజేసిన సందర్భంగా ఆమెను సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి పాల్గొన్నారు.

ప్రతి గడపకు చేరువైన సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



సచివాలయ సమావేశంలో వలంటీర్లకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : సంక్షేమ పథకాల రథసారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పేర్కొన్నారు. సోమవారం యలమంచిలి తులసీనగర్ సచివాలయం పాత వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు పథకాలు అందరికీ చేరుతున్న విధానాన్ని నేరుగా ప్రజలను పేరుపేరున అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ఇవ్వలేనన్ని పథకాలు రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందజేస్తున్నారని, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలు చేరువయ్యాయని అన్నారు. జగనన్న గృహాలు త్వరితగతిన నిర్మించుకోవాలని కోరారు. తులసీనగర్ వార్డులో సమస్యలపై చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారితో మాట్లాడారు. అధికారులు, సచివాలయ సిబ్బందితో సచివాలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రజల సమస్యలు నేరుగా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. తులసీనగర్‌లో ఒక కుటుంబంలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి రూ. 10వేలు ఆర్థిక సాయంగా ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే సొంత నిధులతో వలంటీర్లకు వాటర్ ప్రూఫ్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా), మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్‌లు త్రినాథ్, పిట్టా సత్తిబాబు, దూది నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంధం శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఎస్.రాయవరం : గోకులపాడు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి వార్షికోత్సవ వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి వేకువజాము నుంచి సింధూర , తమలపాకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. సాయంత్రం నిర్వహించిన తీర్థ మహోత్సవంలో పిల్లలు సందడి చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లపరాజు వెంకటరాజు, వియ్యపు సింహాద్రి, సమ్మింగి శ్రీనివాసరావు, అద్దేపల్లి బొజ్జన్న, రాము స్వామిని దర్శించుకున్నారు.

అందుబాటులో పశువైద్య సేవలు



పశువైద్య సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : పశువైద్యంలో చరిత్ర సృష్టించే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి నూతన పథకాలు ఆవిష్కరిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద సంచార పశువైద్య సేవ వాహనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. మనుషులకు 108, 104 తరహాలో 1962 కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ఈ సేవలను అందుబాటులోనికి తీసుకువచ్చారన్నారు. ముందుగా నియోజకవర్గంలో కోటఉరట్ల మండలం తంగేడు పశువైద్య కేంద్రం పరిధిలో వాహనాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, పలువురు పశువైద్యాధికారులు పాల్గొన్నారు.